కేసీఆర్‌ను దెబ్బతీసే కుట్ర



2



2

మన్ కీ బాత్ వీక్షణ



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## భీమ్‌గల్‌కు కోర్టు మంజూరు



**అక్షరటుడే, ఆర్మూర్:** భీమ్‌గల్‌కు కోర్టు మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు విడుదల చేసింది. భీమ్‌గల్లో కోర్టు ఏర్పాటు చేయాలని గత కొంత కాలంగా ఆ ప్రాంత న్యాయవాదులు, పట్టణ నాయకులు, ప్రజలు విన్నవిస్తూ వచ్చారు. ఈ క్రమంలో కోర్టు ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు వెలువడటం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.








పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా

# పసుపు రాజధానిగా ఇందూరు



> పసుపు ఉత్పత్తులకు ఇందూరు రాజధానిగా మారనుంది. రానున్న రోజుల్లో నిజామాబాద్ పసుపు ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి కానుంది. ఈ ప్రాంతంలో పసుపు బోర్డు ఏర్పాటు చేయాలని ఎంపీ అర్వింద్‌తో పాటు తెలంగాణ బీజేపీ నేతలు తీవ్ర ప్రయత్నాలు చేశారు. జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తెలంగాణ పసుపు రైతుల 40 ఏళ్ల కల నెరవేరింది.
>
> – కేంద్ర హోం మంత్రి అమిత్ షా

- ఈ ప్రాంత రైతుల 40 ఏళ్ల కల నెరవేర్చాం
- ఎగుమతుల కోసం ప్రత్యేక వ్యవస్థ
- బిలియన్ డాలర్ల ఉత్పత్తుల ఎక్స్‌పోర్ట్స్ లక్ష్యంగా కేంద్రం కృషి
- కేంద్ర హోం, సహకార మంత్రి అమిత్‌షా
- నిజామాబాద్ పసుపు బోర్డు కేంద్ర కార్యాలయం ప్రారంభోత్సవం

**అక్షరటుడే, ఇందూరు/ నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ పసుపునకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు రానుందని హోం మంత్రి అమిత్ షా తెలిపారు. భారత దేశంలో సాగైన పసుపునకు అంతర్జాతీయంగా ఎంతో డిమాండ్ ఉందని పేర్కొన్నారు. ఒక బిలియన్ డాలర్ల పసుపు ఉత్పత్తుల ఎగుమతులే లక్ష్యంగా కేంద్రం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఆయన ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పసుపు ఉత్పతుల ప్రదర్శనను పరిశీలించారు. ఆ తర్వాత బస్వాగార్డెన్ బోర్డు ప్రారంభోత్స సమావేశం, పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన రైతు సమ్మేళన్‌లో అమిత్‌షా ప్రసంగించారు.

### మార్కెటింగ్‌కు కేంద్రం కృషి

ఆర్గానిక్ పసుపు ఉత్పత్తితో పాటు మార్కెటింగ్‌కు కేంద్రం కృషి చేస్తోందని అమిత్ షా తెలిపారు. పసుపులో ఉండే ఔషధ గుణాలపై ప్రచారం నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఎగుమతులకు కావాల్సిన చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణ పసుపు రైతుల 40 ఏళ్ల కలను మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నెరవేర్చిందని చెప్పారు. ఇందూరు కేంద్రంగా పసుపు బోర్డు మంజూరు చేయడమే కాదు.. నిజామాబాద్ బిడ్డ అయిన పల్లె గంగారెడ్డికే ఛైర్మన్ పదవి అప్పగించామని తెలిపారు. ఈ ప్రాంత రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

### ఎగుమతుల కోసం ప్రత్యేక చర్యలు

పసుపు బోర్డు ద్వారా మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగు పరుస్తామని మంత్రి తెలిపారు. కొనుగోలు, రవాణా, ఎగుమతి పసుపు బోర్డు చూసుకుంటుందని షా వివరించారు. పసుపు మార్కెటింగ్, ఎగుమతుల కోసం కొత్త వ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. భారత్ ఆర్గానిక్ కో ఆపరేటివ్ లిమిటెడ్, భారత్ కో ఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ శాఖలు నిజామాబాద్‌లో ఏర్పాటు చేస్తామన్నారు. వీటి ద్వారా పసుపు ఎగుమతులు పెంచుతామని అమిత్ షా చెప్పారు. బోర్డు ఏర్పాటుతో ఇక ఎప్పటికీ పసుపు రేటు పడిపోదని పేర్కొన్నారు.



### పాకిస్తాన్‌కు దీటైన జవాబు ఇచ్చాం

ఉరి, పుల్వామా, పహల్‌గామ్ దాడులకు దీటైన బదులు ఇచ్చామని అమిత్ షా తెలిపారు. పదేళ్లలో మూడు సార్లు పాకిస్తాన్‌పై భారత్ దాడి చేసిందని చెప్పారు. సర్జికల్ స్ట్రైక్, ఎయిర్ స్ట్రైక్ చేశామని గుర్తు చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్ గడ్డపైకి వెళ్లి దాడి చేశామన్నారు. పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల హెడ్ క్వార్టర్లను భారత సైన్యం ధ్వంసం చేసిందన్నారు. అంతేకాకుండా కీలక టెర్రరిస్టులను మట్టుబెట్టిందని పేర్కొన్నారు. కానీ రాహుల్ గాంధీ ఆధారాలు అడుగుతున్నారన్నారు. పాకిస్తాన్ మాట ఆయన నోట వస్తోందన్నారు.

### 2026లో నక్సల్స్ ముక్త్ భారత్

దేశంలో 2026 వరకు నక్సలిజాన్ని అంతం చేస్తామని అమిత్ షా స్పష్టం చేశారు. దశాబ్దాలుగా అభివృద్ధిని నక్సలిజం అడ్డుకుంటోందన్నారు. మావోయిస్టులు వెంటనే హత్యాకాండ విడిచి తక్షణం లొంగిపోవాలని సూచించారు. దేశ భద్రతను మోదీ పటిష్టం చేస్తున్నారని పేర్కొన్నారు.

### కోట్లు కొల్లగొట్టిన బీఆర్ఎస్

బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో ఎంతో అవినీతి జరిగిందని అమిత్ షా అన్నారు. ధరణి, కాళేశ్వరం, సింగరేణి నియామకాలు, టీఎస్‌పీఎస్సీలో అవినీతి పాల్పడి రూ. కోట్లు కొల్లగొట్టిందని ఆరోపించారు. బీఆర్ఎస్ అక్రమాలను వద్దనుకొని ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం అప్పగించారన్నారు. కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలపై కేసులు నమోదు చేయడం లేదన్నారు. ప్రస్తుతం రేవంత్ సర్కారు కూడా అవినీతి మయంగా మారిందని విమర్శించారు. గతంలో తెలంగాణ బీఆర్ఎస్‌కు ఏటీఎంగా ఉండేదని, ఇప్పుడు ఢిల్లీ కాంగ్రెస్‌కు ఏటీఎంగా మారిందన్నారు. రాష్ట్రంలో అధికారం మారినా అవినీతి మారలేదన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణ బీజేపీ అధికారంలోకి రావడం పక్కా అని పేర్కొన్నారు.

కార్యక్రమాల్లో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, నిజామాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, ఎంపీలు ధర్మపురి అర్వింద్, లక్ష్మణ్, ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రాకేశ్ రెడ్డి, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమురయ్య, పసుపు బోర్డు కార్యదర్శి భవానీ శ్రీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి తదితరులు పాల్గొన్నారు.



### పసుపు ప్రతి ఒక్కరి జీవితంలో భాగం..



పసుపు అనేది ప్రతిఒక్కరి జీవితంలో భాగంగా మారిందని.. అలాంటి పసుపు పంటపైనే తెలంగాణ రైతులు ఆధారపడి ఉన్నారని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. అలాగే కశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు నుంచి నక్సల్ ముక్త్ భారత్ వరకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఉన్నో విజయాలు సాధించిందన్నారు. తాజాగా ఉగ్రవాదులను అంతం చేయడంలో సైతం భారత్ చూపిన తెగువను ప్రపంచ దేశాలు అభినందిస్తున్నాయన్నారు. ఉగ్రవాదుల అంతం కోసం భారత ప్రభుత్వం చేస్తున్న కృషి ఎనలేనిదని స్పష్టం చేశారు. ప్రతి మహిళ సింధూరంలో పసుపు భాగమైందన్నారు. తెలంగాణలో రైతులంతా బీజేపీ వెంటే ఉన్నారన్నారు. పసుపు రైతులపై ప్రేమతోనే నిజామాబాద్ బిడ్డను జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్‌గా ఎంపిక చేశారని గుర్తు చేశారు.



## డీఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అమిత్‌షా

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన దివంగత మాజీ మంత్రి డి.శ్రీనివాస్ కాంస్య విగ్రహాన్ని కేంద్ర మంత్రి అమిత్‌షా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణ గుప్తా, జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, డీఎస్ సోదరుడు సురేందర్, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా ఛైర్మన్ కేశవేణు, కాంగ్రెస్ నాయకులు జావిద్, ఎంపీ అర్వింద్, ఆయన కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## ఎన్‌సీసీ విద్యార్థుల ప్లకార్డుల ప్రదర్శన

**అక్షరటుడే ఇందూరు:** జాతీయ పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభం నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ మైదానంలో ఏర్పాటు చేసిన రైతు సమ్మేళనంలో ఎన్‌సీసీ విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రసంగిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎంబీబీఎస్‌లో ఒక్కశాతం ఎన్‌సీసీ కోటా రిజర్వేషన్‌ను గతంలో తీసివేశారని పేర్కొన్నారు. తిరిగి రిజర్వేషన్ కల్పించాలంటూ ఫ్లకార్డులను ప్రదర్శించారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని బయటికి పంపించేశారు. ఎన్‌సీసీ విద్యార్థులంతా వరంగల్ నుంచి వచ్చినట్లు తెలిసింది.




బోనం.. సంబురం.. 2లో..


## లయన్స్ క్లబ్ సేవలను విస్తరించాలి

**అక్షరటుడే, ఇందూరు:** లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని క్లబ్ పూర్వ గవర్నర్ ఎస్ఎస్ శ్యాంకుమార్ పేర్కొన్నారు. డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్ శివారులోని ఈవీఎం గార్డెన్స్‌లో ఏడు లయన్స్ క్లబ్‌ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్, ఫోర్ట్ సిటీ, ఇందూర్, నందిపేట్, సహార, తెలంగాణ, సెంట్రల్‌ల కార్యవర్గాలతో లయన్స్ పూర్వ గవర్నర్ ఎస్ఎస్ శ్యాంకుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు.

### సేవలను విస్తరించాలి..

అనంతరం శ్యాంకుమార్ మాట్లాడుతూ.. లయనిజంలోకి నూతన సభ్యులను చేర్పించి లయన్స్ సేవలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా మొదటి ఉప గవర్నర్ విజయలక్ష్మి, రెండో ఉప గవర్నర్ నర్సింహరాజు, పూర్వ గవర్నర్లు జి.శ్రీనివాస్, ఈ.వీరేశం, పెంటయ్య, జిల్లా కార్యదర్శి ఎల్.శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అదనపు కార్యదర్శి పి.లక్ష్మీనారాయణ, ప్రోగ్రామ్ ఛైర్మన్ కరిపె రవీందర్, కో ఛైర్మన్ వేములపాటి రవీంద్ర, రీజియన్ ఛైర్మన్ ఉదయ సూర్యభగవాన్, రీజియన్ కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు, జోన్ ఛైర్మన్ అవన్ కుమార్, నర్సింహారావు, భూమన్న, డి.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్ విగ్రహావిష్కరణపై పీసీసీ చీఫ్ కీలక వ్యాఖ్యలు



**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** పీసీసీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నేత డి.శ్రీనివాస్(డీఎస్)విగ్రహాన్ని నిజామాబాద్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా ఆదివారం ఆవిష్కరించనున్నారు. ఎంపీ అర్వింద్ తన తండ్రి విగ్రహాన్ని ఏర్పాటు చేయించగా.. ప్రథమ వర్ధంతి సందర్భంగా అమిత్ షాతో ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టనున్నారు. అయితే డీఎస్ విగ్రహ ఆవిష్కరణపై పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదివారం గాంధీ భవన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన హైదరాబాద్ కాంగ్రెస్ నేతల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి మహేశ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మీడియా చిట్ చాట్‌లో మాట్లాడారు.

### డీఎస్ కాంగ్రెస్ మనిషి

డీఎస్ కాంగ్రెస్ మనిషని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను డీఎస్ వ్యతిరేకంగించారని పేర్కొన్నారు. అలాంటిది ఆయన విగ్రహావిష్కరణకు అమిత్ షాను పిలవడమేమిటని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతోనే డీఎస్ విగ్రహం ఏర్పాటు అయ్యిందన్నారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డిని పిలవకపోవడంపై ఆయన ప్రశ్నించారు. డీఎస్ విగ్రహాన్ని అమిత్ షా ఆవిష్కరిస్తే ఆయన ఆత్మ బాధ పడుతుందని మహేశ్ గౌడ్ వ్యాఖ్యానించారు.

## కేసీఆర్ కుటుంబాన్ని దెబ్బతీసే కుట్ర




**అక్షరటుడే, ఆర్మూర్:** రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబాన్ని దెబ్బతీసే కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఎల్లో మీడియా, బీజేపీ చేస్తున్న కుట్రలో భాగంగానే బీఆర్ఎస్ పార్టీపై బురద జల్లే కార్యక్రమం జరుగుతోందన్నారు. పనిగట్టుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్ వ్యక్తిగత జీవితానికి భంగం కలిగిస్తే ఊరుకునే పరిస్థితి లేదన్నారు. రేవంత్‌రెడ్డి చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించుకునేందుకు తెలంగాణను భ్రష్టు పట్టిస్తున్నాడని ఆరోపించారు.

## మంత్రులను కలిసిన ఆర్మూర్ నేతలు



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, మంత్రి తుమ్మల నాగేశ్వరారావును ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలను వివరించారు. అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, వెంకట్ రాంరెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధి కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**అక్షరటుడే, బాన్సువాడ:** మండలంలోని కోనాపూర్ గ్రామంలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీని గ్రామస్తులు అందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జెట్టి మొగలాకర్ రావు, ఉపాధ్యక్షుడిగా చౌల్లేటి శ్రీనివాస్, కార్యదర్శిగా వడ్ల శివరాం శ్రీను, కోశాధికారిగా సాయి రెడ్డి, సలహాదారులుగా మాజీ సర్పంచ్ వెంకట రమణారావు దేశ్‌ముఖ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు తెలిపారు.

## ముగిసిన పాలిసెట్ మొదటిదశ ధ్రువపత్రాల పరిశీలన




**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడురోజులుగా జరుగుతున్న పాలిసెట్ మొదటి దశ ధ్రువపత్రాల పరిశీలన ఆదివారం విజయవంతంగా ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ డా.విజయ్ కుమార్ తెలిపారు. మూడురోజుల్లో 416 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించి కన్ఫర్మేషన్ లెటర్ అందించినట్లు తెలిపారు. అనంతరం పాలిసెట్ ఎంట్రెన్స్ పరీక్షలో ఉత్తమ ర్యాంక్ సాధించిన విద్యార్థులను అభినందించారు. జూలై 1 వరకు విద్యార్థులు తమకు నచ్చిన కళాశాల కోసం ఆప్షన్ ఇవ్వాలని జూలై 4న మొదటి విడత సీట్ అలాట్మెంట్ జరుగుతుందని తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనలో వెరిఫికేషన్ ఆఫీసర్స్ అజహారొద్దీన్, ఫర్హీన్ ఫాతిమా, శ్రీలత, ఆఫ్రీన్ ఫాతిమా, పవన్ కుమార్ సిబ్బంది కనకరాజు, నాగరాజు పాల్గొన్నారు.

## వామపక్ష నాయకుల ముందస్తు అరెస్ట్




**అక్షరటుడే, ఇందూరు/బోధన్:** కేంద్ర హోం మంత్రి అమిత్ షా నిజామాబాద్ జిల్లా పర్యటన సందర్భంగా ముందస్తు పేరుతో వామపక్ష నాయకులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా అరెస్ట్‌లను టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, సీపీఐ ఎంఎల్ జిల్లా కమిటీ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ ఖండించారు. టీయూసీఐ, పీడీఎస్యూ, అఖిల భారత కూలీ సంఘం, సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, సీపీఎం నాయకులను ఉమ్మడి జిల్లాలో అరెస్టులు చేసి ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారన్నారు. ముందస్తు పేరుతో పోలీసులు చేస్తున్న అక్రమ అరెస్టులను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని సూచించారు.

## 'మన్ కీ బాత్' వీక్షించిన బీజేపీ నాయకులు



**అక్షరటుడే, కోటగిరి:** పోతంగల్ మండల కేంద్రంలో పీఎం నరేంద్ర మోదీ 123వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు వీక్షించారు. 21వ బూత్ అధ్యక్షుడు సూదం అశోక్ నివాసంలో కార్యక్రమాన్ని ఆదివారం వీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కల్లూరి హన్మాండ్లు (బజరంగ్), జిల్లా కౌన్సిల్ మెంబర్ మక్కయ్య, బాన్సువాడ నియోజకవర్గం ఓబీసీ మోర్చా కన్వీనర్ నాగం సాయిలు, బూత్ అధ్యక్షుడు శంకర్, గాండ్ల విజయ్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






అమిత్‌షాకు స్వాగతం పలుకుతున్న రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎంపీ అర్వింద్, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే ధన్‌పాల్

# అమిత్ షా పర్యటన విజయవంతం








సీపీ సాయి చైతన్య..



పూజలు చేస్తున్న అమిత్‌షా



అమిత్‌షాకు ప్రతిమను అందజేస్తున్న పల్లె గంగారెడ్డి



పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి అమిత్ షా

### పసుపు రైతుల కల నెరవేర్చాం



పసుపు రైతుల దశాబ్దాల కలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ పసుపు సాగవుతున్నా.. ఈ ప్రాంతంపై ప్రేమతో ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలు నిజామాబాద్‌లో పసుపుబోర్డు కేంద్ర కార్యాలయం ఏర్పాటు చేశారన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతు పక్షపాతి అని పేర్కొన్నారు.

### నిజామాబాద్ జిల్లా వాళ్లు గొప్పోళ్లు



నిజామాబాద్ జిల్లా వారు గొప్ప వాళ్లని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎన్నో పోరాటాలు చేసి పసుపు బోర్డు సాధించారని ఆయన పేర్కొన్నారు. ఇందూరు రైతులు హీరోలు అని ఆయన అభివర్ణించారు. ఎంపీ అర్వింద్‌ను ఢిల్లీలో పసుపు అర్వింద్ అంటున్నారని ఆయన పేర్కొన్నారు. పసుపు బోర్డు కోసం అర్వింద్ ఎంతో కృషి చేశారన్నారు. రైతును రారాజు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

### పసుపు రైతుల పోరాటాలతో..



వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ పసుపు రైతుల అనేక పోరాటాల ఫలితంగా పసుపు బోర్డు వచ్చిందన్నారు. మోదీ ప్రభుత్వం రైతుల ఆకాంక్షలను గుర్తించి బోర్డును మంజూరు చేయడం సంతోషకరమన్నారు. అందులోనూ ఇందూరుకు బోర్డు రావడం గర్వకారణమన్నారు. ఇందుకోసం ఎంపీ అర్వింద్ ఎంతో కృషి చేశారన్నారు. ప్రధాని మోదీతో పాటు అమిత్‌షాను కలిసి బోర్డు తీసుకురావడానికి కృషి చేసిన అర్వింద్‌ను అభినందించారు.

### బాధ్యతగా విధులు నిర్వర్తిస్తా



ప్రధాని మోదీ, అమిత్‌షా సహకారంతో ఎంపీ అర్వింద్ పసుపుబోర్డు సాధించారని జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి పేర్కొన్నారు. జాతీయ కార్యాలయం సైతం నిజామాబాద్‌లో ఏర్పాటు చేయడం అభినందనీయన్నారు. 30ఏళ్లుగా బీజేపీ కార్యకర్తగా పనిచేశానని.. పసుపుబోర్డు జాతీయ అధ్యక్షుడి హోదా ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.



మహమ్మద్ నగర్‌లోని తున్కిపల్లిలో..



భిక్కనూర్‌లో బోనాలను తీసుకెళ్తున్న మహిళలు

# భక్తితో గ్రామదేవతలకు బోనాలు

ఉమ్మడిజిల్లాలో గ్రామదేవతలకు భక్తితో పూజలు చేశారు. ఆషాడం ఆరంభం గ్రామాల్లో ప్రజలు వనభోజనాలకు వెళ్లారు. ఆయా గ్రామాల్లో బోనాలు తీశారు. గంగాజలాలను తీసుకొచ్చి దేవతలకు జలాభిషేకం చేశారు. గ్రామ దేవతలైన దుర్గమ్మ, నల్ల పోచమ్మ, ఎల్లమ్మ, గంగమ్మ తదితర గ్రామదేవతలకు భక్తితో బోనాలు తీశారు. గ్రామదేవతలకు మహిళలు ఒడి బియ్యం పోశారు. ప్రత్యేక వంటకాలు చేశారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్



ఆలూర్ మండల కేంద్రంలో..

## ఆలయంలో స్వచ్ఛ కార్యక్రమం



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని వెంకటేశ్వర కాలనిలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆర్మూర్ 'మహాత్మ స్వచ్ఛంద సంస్థ' ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సుంకే శ్రీనివాస్, అల్జాపూర్ మహేందర్, ఆలయ కమిటీ అధ్యక్షులు గడ్డం సంజీవరెడ్డి, శ్రావణ్, భోజన్న, స్వచ్ఛంద సంస్థ సభ్యులు ప్రశాంత్, సుంకె నిశాంత్, జీడీ రాజ్ కుమార్, జంగిడి భోజన్న, గణేష్, ఒత్తూరు రాజయ్య, నరేష్, నూకల ఆదిత్య, ముధుసూదన్, బాశెట్టి పెద్ద గంగారాం, శ్యాంసుందర్, కృషివర్ధన్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**అక్షరటుడే, కామారెడ్డి గ్రామీణం:** దోమకొండ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నిమ్మ రాజనర్సు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ సందర్భంగా ఆయన కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తనయుడు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకులు గంప శశాంక్ ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుంచాల శేఖర్, యూత్ అధ్యక్షుడు పాలకుర్తి శేఖర్, పట్టణ అధ్యక్షులు బోరెడ్డి కిషన్ రెడ్డి మాజీ ఎంపీటీసీలు ఆశంశెట్టి పోచయ్య, నాగరాజు రెడ్డి, నాయకులు కానుగంటి నాగరాజు, చిట్యాల రాజిరెడ్డి, నేతుల శ్రీనివాస్ యాదవ్, చిన్న శ్రీనివాస్ యాదవ్, చెన్నుగారి నర్సింలు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## అనుమానితుడిని పట్టుకున్న గ్రామస్థులు

**అక్షరటుడే, ఇందల్వాయి:** గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురిని వెంబడించగా ఒకరు పట్టుబడ్డారు. ఈ ఘటన మండలంలోని గన్నారం గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్నారం గ్రామంలో శనివారం రాత్రి ముగ్గురు అనుమానిత వ్యక్తులు సంచరిస్తుండగా.. గ్రామస్థులు వారిని వెంబడించారు. వారిలో ఇద్దరు పారిపోగా ఒకరు మాత్రం పట్టుబడ్డాడు. దీంతో అతడిని గ్రామస్థులు బంధించారు. ముగ్గురం కలిసి చోరీకి వచ్చామని అందులో ఇద్దరు పారిపోయారని పట్టుబడ్డ నిందితుడు పేర్కొన్నాడు. అనంతరం గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటనాస్థలానికి చేరుకుని అనుమానితుడిని స్టేషన్‌కు తరలించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



**అక్షరటుడే,బిచ్కుంద:** ఏఎస్ఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శిగా సేవలు అందించిన జుక్కల్ మండలం పడంపల్లి గ్రామానికి చెందిన వాగ్మరి బాలరాజ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దీంతో ఆదివారం ఆయన కుటుంబాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అయ్యాల సంతోష్, ఫౌండేషన్ నాయకులు పరామర్శించారు. కుటుంబానికి రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. ఏఎస్ఆర్ ఫౌండేషన్ నాయకులు రోటే సాయిలు, బక్రె అనిల్, కాందేవార్ శ్రీకాంత్, నాగ్‌నాథ్ ఉన్నారు.